ప్రజాశక్తి
ఆదివారం 22 అక్టోబర్ 2023 5
పార్వతీపురం మన్యం

23న జగనన్నకు చెబుదాం రద్దు

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రతి సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించనున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమం రద్దు అయినదని కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారి ఆర్.ఉమామహేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 23న దసరా సందర్భముగా ప్రభుత్వం వారు శెలవు దినంగా ప్రకటించినందున సోమవారం జరుగు జగనన్న కు చెబుదాం కార్యక్రమము నిర్వహించబడదని తెలిపారు.

సాగునీరందక ఎండుతున్న వరిచేలు

ఈ ఏడాది ఆగస్టు, సెప్టెంబర్‌లో కురిసిన వర్షాలకు ఖరీఫ్ ఎంతో ఆశాజనకంగా ఉండి ఆర్థికంగా తమకు ఎంతో ఊరటనిస్తుందనుకున్న రైతన్నలకు గత నెలరోజులుగా వర్షాల్లేక కళ్లముందే పంటలు ఎండిపోతుంటే బరువెక్కిన గుండెలతో రోధిస్తూ ఏమాత్రమైన ప్రకృతికరుణించదా అన్న ఆశతో వాన చినుకుల కోసం ఆకాశంవైపు ఎంతగా ఆశగా చూసే పరిస్థితి జిల్లా అంతటా నెలకొంది.



చినబొండపల్లిలో ఎండిపోయిన వరిచేను

మోటారు సాయంతో తోడుతున్న రైతు

వరుణుడి కోసం అన్నదాత ఎదురుచూపు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

పార్వతీపురం, సీతానగరం, గరుగుబిల్లి మండలాలకు సాగునీరందించాల్సిన జంఝావతి లోలెవెల్ కాలువ పరిధిలో సంబంధిత అధికారులు నిర్వహణ పనులు చేయకపోవడంతో ఎక్కడికక్కడ గుర్రపుడెక్క, పిచ్చిమొక్కలు మొలిచిపోవడంతో సుమారు 9వేల ఎకరాలకు సాగునీరందని పరిస్థితి ఏర్పడింది. అరకొరగా నీరు ప్రవహిస్తున్నప్పటికీ సీతానగరం, పార్వతీపురం రైతులు ఎక్కడికక్కడ ఇసుక బస్తాలు వేసి నీటిని తమ ప్రాంతాలకు మళ్లించడంతో శివారు ప్రాంతాలైన అడ్డాపుశీల, సీతారాంపురం, కొండకరకాం, ఉల్లిభద్ర, దళాయివలస, గుడ్డివలస, తులసిరామినాయుడువలస, గొల్లవలస, గొట్టివలస, పెద్దూరు, గరుగుబిల్లి గ్రామాలకు చుక్కనీరు అందక రైతులు విలవిలలాడుతున్నారు. పార్వతీపురం మండలంలో దాదాపు 18వేల ఎకరాల వ్యవసాయ భూములకు గాను ఈ ఏడాది 15వేల ఎకరాల్లోనే వరిసాగు చేస్తున్నారు. అందులో సుమారు 2వేల ఎకరాలు ఎద పద్ధతిలో పండింంగా, దాదాపు 4వేల ఎకరాలు వ్యవసాయాధారిత భూములు, మిగతా 9వేల ఎకరాలు చెరువుల కిందే సాగవుతుంది. జంఝావతి ఎగువకాలువ ద్వారా నీరందించగలిగితే సుమారు కొమరాడ, పార్వతీపురం, సీతానగరం మండలాలకు చెందిన 26వేల ఎకరాలకు సాగునీరు అందించేది. పాలకుల నిర్లక్ష్యం వల్ల కాలువలు పూర్తిస్థాయిలో ఉన్నప్పటికీ అందులో నీరు ప్రవహించని పరిస్థితి ఏర్పడింది. తోటపల్లి ప్రాజెక్టు జిల్లాలోనే ఉన్నప్పటికీ దానివల్ల కేవలం రెండేరెండు మండలాలకు ప్రయోజనం కలుగుతుంది. అది కూడా డిస్ట్రిబ్యూటర్ చానల్స్ ఏర్పాటు చేయకపోవడంతో చెంతన ప్రాజెక్టు ఉన్నప్పటికీ ఏమాత్రం ఉపయోగపడని దుస్థితి. ఈ ఏడాది పార్వతీపురం నియోజకవర్గంలో ఎద పండించిన రైతులు ఇప్పటికే వరి పంటపై ఆశలు వదులుకున్నారు. ఇక వర్షాధార రైతులు చినుకు కోసం ఆకాశంవైపు చూస్తున్నారు. ఇప్పటికైనా జిల్లాలోని రైతుల పరిస్థితిపై అధికారులు అధ్యయనం చేసి ఉన్న కాస్త జలవనరులు సక్రమంగా పంట పొలాలకు అందేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుకుంటున్నారు.

ప్రభుత్వమే ఆదుకోవాలి

ఈ ఏడాది వర్షాభావంతో వరి పంట పూర్తిగా పొట్ట పోసిన పరిస్థితి దాపురించింది. వ్యవసాయం ఖర్చులు తడిసి మోపు డైనప్పటికీ వాతావరణం ఒక్కసారిగా ఇలా మారిపోవడంతో పంటపై ఆశలు వదులుకుంటున్నాం. మరో రెండురోజుల్లో వర్షాలు కురవకపోతే మండలంలో దాదాపు రైతులందరి పరిస్థితి గల్లంతే. పొట్టదశలో నీరులేక పంట ఎండిపోతుంది. అధికారులు స్పందించి ప్రభుత్వం ఆదుకునేలా చర్యలు చేపట్టాలి.

గుంట్రెడ్డి సతీష్‌కుమార్, వ్యవసాయదారుడు, పుట్టూరు

ఆశలు వదులుకున్నాం

ఈ ఏడాది వర్షాలు ఆలస్యంగానైనా పడి ఆశలు రేకెత్తించడంతో ఎదపంటను విస్తారంగా జల్లుకున్నాం. ఆ తరువాత వానలు కురవక, ఎండలు విపరీతంగా మండి పోవడంతో పైరు పూర్తిగా ఎండి పోయింది. నాకున్న ఐదెకరాల్లో ఎదజల్లుకోవడ వల్ల ఫలసాయంపై పూర్తిగా ఆశ వదులుకున్నాం.

గండి జోగినాయుడు, రైతు, చినబొండపల్లి

సాగునీటి కోసం రైతులు ఎదురు చూపులు

పాలకొండ : సాగునీరు కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో పలు గ్రామాల్లో సాగునీరు అందకపోవడంతో రైతులు అవస్థలు చెందుతున్నారు. తోటపల్లి ప్రాజెక్ట్ ఎడమ కాలువ ద్వారా నీరు విడిచి పెట్టినప్పటికీ శివారు ప్రాంతాలకు నీరందడం లేదు. 7,8 బ్రాంచ్‌ల కింద 15వేల ఎకరాలు సాగవుతున్నప్పటికీ పదివేల ఎకరాలకు సాగునీరందక పంటలు ఎండిపోయే పరిస్థితి కనిపిస్తుంది. వర్షాలు కూడా ఆశించిన స్థాయిలో కురవకపోవడంతో వరి పొట్టదశలో పూర్తిగా నాశనవుతుంది. పలు గ్రామాల్లో రైతులు చెరువులో ఇంజిన్లు పెట్టి వ్యవసాయం చేసే పరిస్థితి నెలకొంది.

యుటిఎఫ్ దీక్షలు భగ్నం

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

సిపిఎస్, జిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్‌ను కొనసాగించాలని కోరుతూ యుటిఎఫ్ నాయకత్వం గత మూడు రోజులుగా కలెక్టర్ కార్యాలయం ఎదుట కొనసాగిస్తున్న నిరాహార దీక్షలను శనివారం పోలీసులు భగ్నం చేశారు. దీక్షలో పాల్గొన్న యుటిఎఫ్ నాయకులు ఐ.రోజామణి ఆరోగ్యం క్షీణించడంతో శుక్రవారం రాత్రి ఆమెను ఆసుపత్రికి తరలించారు. దీన్ని సాకుగా తీసుకున్న పోలీసులు దీక్షలో ఉన్న జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తోట రమేష్, ఎస్.మురళీమోహనరావుతో పాటు ఇతర ఉపాధ్యాయులను, నాయకులను బలవంతంగా జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బలవంతంగా దీక్షలను ప్రభుత్వం, పోలీసులు కలిసి భగ్నం చేయవచ్చునేమో కానీ ఉద్యోగుల మనసులను మాత్రం గెలవలేరని అన్నారు. భవిష్యత్తులో పోరాటాన్ని మరింత ఉధృతం చేసి ఐక్యపోరాటాలు నిర్వహిస్తామని తద్వారా ఒపిఎస్‌ను పునరుద్ధరించుకుంటామని తెలిపారు. ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల కర్కశంగా వ్యవహరిస్తుందని, దీక్షలను బలవంతంగా విరమింపజేయడం ప్రభుత్వం చేతకానితనానికి అద్దం పడుతుందని, భవిష్యత్తులో ప్రభుత్వ వైఖరిపై పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఒపిఎస్ సాధనకు ప్రాణాలైనా అర్పిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా తమకు మద్దతుగా నిలిచిన ఇతర ఉపాధ్యాయ, ప్రజా సంఘాలు, వివిధ రాజకీయ పార్టీలకు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు పి.సుదర్శన్, ఐ.రోజామణి, ఎం.శంకరరావుతో పాటు జిల్లా వ్యాప్తంగా, పలు మండలం నుంచి వచ్చిన ఉపాధ్యాయ సంఘ నాయకులు పాల్గొన్నారు.

దీక్షలో పాల్గొన్న యుటిఎఫ్ నాయకులను లాక్కెళ్తున్న పోలీసులు

అంగన్వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జిల్లాలోని ఐసిడిఎస్ ప్రాజెక్ట్‌లో ఖాళీగా ఉన్న ఎనిమిది అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులను కోరుతున్నట్లు జిల్లా స్త్రీ,శిశు సంక్షేమ, సాధికారిత అధికారి కె.విజయగౌరి పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె శనివారం ఒక ప్రకటన జారీ చేశారు. పాలకొండ మునిసిపల్ పరిధిలో రెండు అంగన్వాడీ కార్యకర్తలు, మూడు సహాయకుల పోస్టులతో పాటు బలిజిపేట ప్రాజెక్ట్ పరిధిలో ఒక అంగన్వాడీ కార్యకర్త, రెండు సహాయకుల పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ఆమె చెప్పారు. ఈ ఖాళీలను రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రాతిపదికన నిర్దేశించిన కమ్యూనల్ రోస్టర్ రిజిస్టర్ అనుసరించి, ఐసిడిఎస్ ప్రాజెక్టు ఒక యూనిట్ గా పరిగణించి సంబంధిత కేటగిరీ అభ్యర్థులతో భర్తీ చేయనున్నట్లు తెలిపారు. కావున అర్హులైన వివాహిత మహిళా అభ్యర్థినులు తమ దరఖాస్తులను ఈ నెల 25 నుండి నవంబర్ 1న సాయంత్రం 5గంటల్లోపు సంబంధిత ఐసిడిఎస్ ప్రాజెక్ట్ వారి కార్యాలయానికి అందజేయాలని కోరారు. ఇంటర్వ్యూ తేదీ, స్థలం తదుపరి తెలియజేయ బడుతుందని, నియమ నిబంధనల మేరకు వచ్చిన దరఖాస్తుదారులను మాత్రమే ఇంటర్వ్యూలకు పిలవడం జరుగుతుందని అన్నారు. సదరు పోస్టులకు దరఖాస్తు చేసే అభ్యర్థులు 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు.

అమరుల త్యాగాలు మరువలేనివి

ప్రజాశక్తి- పార్వతీపురంరూరల్

సమాజ రక్షణ కొరకు ప్రాణత్యాగం చేసిన పోలీసు అమర వీరుల సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని కలెక్టరు నిశాంత్ కుమార్ పేర్కొన్నారు. శనివారం స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన పోలీసు అమరుల సంస్మరణ దినోత్సవానికి కలెక్టర్ హాజరై నివాళులు అర్పించారు. ఎస్‌పి విక్రాంత్ పాటిల్, జాయింటు కలెక్టరు ఆర్.గోవిందరావు, ఎఎస్‌పి ఒ.దిలీప్‌కిరణ్, డిఎస్‌పిలు, సిఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పోలీసు అమర వీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలను ఉంచి నివాళ్లు అర్పించారు. అనంతరం కలెక్టరు మాట్లాడుతూ దేశ భద్రతకు ప్రాణ త్యాగాలు చేసిన పోలీసు వీరులను స్మరించుకొంటూ ప్రతి ఏటా అక్టోబరు 21న అమరుల సంస్మరణ దినోత్సవం జరుపుకొంటున్నామన్నారు. విధి నిర్వహణలో అనేక మంది పోలీసులు ప్రాణత్యాగం చేశారన్నారు. పోలీసులు విధి నిర్వహణలో రాజీలేని పోరాటాలకు జరిపి తీవ్రవాద చర్యలను ఎదిరించడంలోనూ, శాంతిభద్రతల పరిరక్షణలోను కీలకమైన పాత్రను పోషిస్తూనే ఉన్నారన్నారు. జిల్లా పోలీసుశాఖలో ఇప్పటి వరకు శాంతి భద్రతల పరిరక్షణలో ఒకరు, తీవ్రవాద ప్రతీకార దాడులలో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారని, ప్రజల రక్షణ కోసం ప్రాణాలు కోల్పోయిన పోలీసులు నేడు భౌతికంగా మన మధ్య లేకున్నా, పోలీసుశాఖకు వారు చేసిన సేవలు శ్లాఘనీయని, వారి కుటుంబాలను గౌరవించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా కొమరాడ పోలీసు స్టేషనులో ఎస్ఐగా పనిచేస్తూ విధినిర్వహణలో అమరులైన ముద్దాడ గాంధీ సతీమణి మనోరంజని, వారి కుటుంబ సభ్యులను, కురుపాం పోలీసు స్టేషనులో కానిస్టేబుల్‌గా పనిచేస్తూ విధి నిర్వహణలో అమరులైన బి.శ్రీరాములు సతీమణి ప్రమీల, వారి కుటుంబ సభ్యులను గౌరవించి, వారు సమాజానికి చేసిన త్యాగాలను స్మరించుకొన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ. పివిఆర్‌కె కుమార్ పెరేడ్ కమాండర్‌గా వ్యవహరించారు.

సాలూరు: పోలీసు అమరులకు స్థానిక అర్బన్, రూరల్ పోలీసులు ఘనంగా నివాళ్లు అర్పించారు. పోలీసు అమరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా రూరల్ పోలీస్ స్టేషన్ ముందు గల కీర్తిశేషులు సిఐ ముద్దాడ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రూరల్ సిఐ ఎస్.ధనంజయరావు, ఎస్ఐ ప్రయోగ మూర్తి, పాచిపెంట ఎస్ఐ ఫకద్దీన్, టౌన్ సిఐ సిహెచ్.శ్రీనివాసరావు నివాళులర్పించారు. ముద్దాడ గాంధీ విధి నిర్వహణలో చేసిన సేవలను కొనియాడారు. ఆయన కుటుంబ సభ్యులతో పాటు స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

పాలకొండ: పోలీస్ అమరుల సేవలు అమూల్యమైనవని డీఎస్పీ జివి కృష్ణరావు కొనియాడారు. పోలీసు అమరుల దినోత్సవం సందర్భంగా స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో అమరవీరుల చిత్రపటాలకు పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి వరకు పోలీసులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ మురళీధర్, ఎస్ఐ శివప్రసాదరావు, సిబ్బంది ఉన్నారు.

అమరుల స్థూపం వద్ద నివాళ్లు అర్పిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

ప్రజా సంక్షేమం పట్టని ప్రభుత్వాలు

- 30 నుంచి సిపిఎం ప్రజా రక్షణ భేరి బస్సుజాతా
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సుబ్బరావమ్మ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించి తమ స్వార్థ రాజకీయాల కోసం పాలన సాగిస్తున్నాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.సుబ్బరావమ్మ విమర్శించారు. శనివారం స్థానిక ఆదివాసీ గిరిజన సంఘం కార్యాలయంలో విలేకరులతో ఆమె మాట్లాడారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజన హక్కులు, చట్టాలను పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నా వైసిపి, టిడిపి ప్రశ్నించే పరిస్థితి లేదన్నారు. ప్రజా సమస్యలపై ఎజెండాలను పక్కనపెట్టి కేవలం బటన్ నొక్కుతూ వైనాట్ 175 అని జగన్ అంటుంటే, మరోవైపు టిడిపి కేసుల నుంచి ఎలా బయటపడాలా అని ఆలోచిస్తుందని విమర్శించారు. ఈ ఏడాది సకాలంలో వర్షాల్లేక 340 మండలాల్లో కరువు ఛాయలు ఉన్నాయని తెలిపారు. రైతు సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారన్నారు. జిఒ 3ను రద్దు చేశారని, 200 మంది సవరభాషా వాలంటీర్లకు ఉద్యోగ భద్రత కరువైందని అన్నారు. అంగన్వాడీ, గ్రీన్ అంబాసిడర్లకు నెలల తరబడి వేతనాలు చెల్లించడం లేదన్నారు. ప్రభుత్వాసుపత్రుల్లో వైద్యులు, మందులు లేక ప్రజలకు వైద్యం అందని పరిస్థితి ఉందన్నారు. పాఠశాలల విలీనం పేరుతో ప్రభుత్వ పాఠశాలలను ఎత్తివేసి గిరిజన విద్యార్థులకు ప్రభుత్వ విద్య అందకుండా చేస్తున్నారని మండిపడ్డారు. మరోవైపు నిత్యవసరాలైన పెట్రోల్, గ్యాస్, పప్పు దినుసులు, కూరగాయల ధరలు అమాంతంగా పెంచుకుపోతున్నారన్నారు. ట్రూ అప్ ఛార్జీల పేరుతో విద్యుత్ వినియోగంపై భారం వేస్తున్నారన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు సిద్ధపడటం విచారకరమన్నారు. కురుపాం నియోజకవర్గంలో పూర్ణపాడు, లాబేసు వంతెన నిర్మాణం నేటికీ పూర్తి చేయలేదని, చెక్ డ్యాములు, రిజర్వాయర్లు అభివృద్ధికి నోచుకోక పంట పొలాలకు సాగునీరందడం లేదని అన్నారు. ఏనుగుల సమస్య ఎన్నో ఏళ్లగా ఉన్నా పరిష్కరించలేదన్నారు. డోలి మోతలు నేటికీ కొనసాగుతున్నా స్థానిక ప్రజాప్రతినిధులు ఏం చేస్తున్నారని ఆమె ప్రశ్నించారు.

ప్రజా రక్షణ భేరి బస్సు యాత్రలు

అసమానతులు లేని అభివృద్ధి కోసం ఈనెల 30 నుంచి సిపిఎం ప్రజా రక్షణ భేరి పేరుతో మూడు బస్సు జాతాలు నిర్వహిస్తున్నట్లు సుబ్బరావమ్మ తెలిపారు. సీతంపేటలో (గిరిజనుల సమస్యలపై), కర్నూలు జిల్లా ఆదోని (వ్యవసాయ కార్మికుల సమస్యలపై), శ్రీకాకుళం జిల్లా మందసలో (పారిశ్రామిక రంగ సమస్యలపై) బస్సు యాత్రలు ప్రారంభిస్తున్నట్లు ఆమె తెలిపారు. సీతంపేటలో బస్సు జాత ప్రారంభించిన రోజే కురుపాంలో బహిరంగ సభ నిర్వహిస్తున్నామన్నారు. ఈ సభకు సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ముఖ్యఅతిథులుగా పాల్గొంటారని అన్నారు. అనంతరం నవంబర్ 15న విజయవాడలో భారీ బహిరంగ సభతో జాతా ముగుస్తుందని తెలిపారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోలక అవినాష్, జిల్లా కమిటీ సభ్యులు మండంగి రమణ, కోరాడ ఈశ్వరరావు, సిఐటియు నాయకులు కె గౌరీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బరావమ్మ

జైకా నిధులు రూ.18కోట్లు ఏమయ్యాయి?

- పెదంకలాం ఆనకట్ట కాలువ పనులు పూర్తి చేయాలి
- రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్
- 23న తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని పెదంకలాం ఆనకట్ట అభివృద్ధికి మంజూరైన జైకా నిధులు ఖర్చు పెట్టకుండా అధికారులు, పాలకులు ఏం చేశారని, సకాలంలో కాలువ పనులు పూర్తి చేయకపోవడంతో తమ పొలాలు పూర్తిగా ఎండిపోతున్నాయని రౌండ్‌టేబుల్ సమావేశంలో పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో ఎపి రైతు సంఘం ఆధ్వర్యాన నాయకులు బలగ సత్యనారాయణ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తొలుత రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గేదెల సత్యనారాయణ మాట్లాడుతూ పనుకువలస, అరసాడ, పెదమాయవలస, రావివలస, నారాయణపురం, వెంగాపురం, చెల్లింపేట, తుమరాడ, బలిజిపేట, పలగర, చిలకలపల్లి, వెంగళరాయపురం, విజయనగరం జిల్లా వంగర మండలం చంద్రంపేట, ఇరువాడ, మరువాడ, కోనంగిపాడు, గీతనాబిల్లి తదితర 18 గ్రామాల పరిధిలో 8వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వాల్సి ఉందన్నారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత అంకలాం కాలువ అభివృద్ధి పేరిట ఈ నాలుగేళ్లలో చుక్కనీరు ఇవ్వలేదని విమర్శించారు. మూడేళ్ల కిందట మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఆర్భాటంగా జైకా నిధులు రూ.18కోట్లతో పనులు ప్రారంభించినా ఎందుకు ముందుకు సాగడంలేదని ప్రశ్నించారు. కనీసం అధికారులకు, నాయకులకు తెలుసుకొనే తీరికలేకపోవడం దురదృష్టమన్నారు. ఖరీఫ్ సీజన్ రావడం వల్ల తప్పనిసరి పరిస్థితుల్లో రైతులు తమ శ్రమదానంతో గండ్లు పూడ్చుకొని కాలువల్లోని పూడిక తొలగించుకున్నారన్నారు. అసలు మంజూరైన రూ.18 కోట్లు ఏమైయ్యాయని, ప్రభుత్వం ఆ నిధులు విడుదల చేయలేదా, లేకుంటే అందరూ కలిసి పంచుకున్నారా అనేది అధికారులు, ప్రభుత్వం తేల్చాలని డిమాండ్ చేశారు. ఈ విషయం ఎవరూ చెప్పడం లేదని, ఎప్పుడు పూర్తి చేస్తారో అది కూడా చెప్పడం లేదని అన్నారు. రైతు సంఘం, రైతులు పరిశీలన నేపథ్యంలో అనేక సమస్యలు బయటకు వచ్చాయన్నారు. ఆనకట్ట దగ్గర షట్టర్లు సక్రంగా లేవని, ఎక్కడపడితే అక్కడ గండ్లు ఉన్నాయని, కాలువ మొత్తం పూడికలతో పేరుకు పోయిందన్నారు. వర్షాభావం వల్ల వరి పంట పొట్ట దశలో వర్షాలు లేక చివరి భూములకు నీరు రాక రైతులు సొంత డబ్బులతో కాలువల్లో పూడుకలు తీసుకోవడం దురదష్టకరమని అన్నారు. తక్షణమే కాలువలో పూడికలు తీయాలని, జైకా నిధులు ఏమయ్యాయో రైతులకు చెప్పాలని, కాలువ పనులు త్వరగా పూర్తి చేయాలని కోరుతూ ఈనెల 23న స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా తలపెట్టినట్టు తెలిపారు. కావున ఈ ధర్నాలో రైతులంతా పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని రౌండ్ టేబుల్ పిలుపునిచ్చింది. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వంజరాపు సత్యనాయడు, కౌలు రైతు జిల్లా కార్యదర్శి ఆవు సాంబమూర్తి, భానుమూర్తి, గౌరినాయుడు, పోలినాయుడు, త్రినాథ్, నారాయుడు, అప్పలస్వామి, గౌరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు గేదెల సత్యనారాయణ

మీసానికి సంపంగి నూనెట!

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

మింగ మెతుకులేదంటే మీసానికి సంపంగి నూనె వేసుకోమన్నాడట వెనుకటి ఓ వ్యక్తి. రైతులకు అధికార యంత్రాంగం ఇస్తున్న సలహాలు అచ్చం అలాగే ఉన్నాయి. అసలు నీరే లేదంటే నీటి వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తారట. ఇందుకనుగుణంగా మొన్న (శుక్రవారం) జరిగిన వ్యవసాయ సలహా మండలి సమావేశంలో పాలకులు, అధికారులు కలిపి కీలక నిర్ణయం చేశారు. ఈ విషయం క్షణాల్లో సోషల్ మీడియా ద్వారా బయటకు వెళ్లడంతో ఔరా..! అంటూ రైతాంగం ముక్కున వేళ్లేసుకుంటోంది. జిల్లాలో సుమారు 70శాతం ప్రజానీకం వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారు. మరో 10 నుంచి 15శాతం మందికి కూడా పరోక్షంగా వ్యవసాయ రంగమే జీవనాధారం. ఇటువంటి జిల్లాలో వ్యవసాయ ప్రాధాన్యత ఏ మేరకు ఉండాలో ప్రత్యేకించి చెప్పనక్కరలేదు. ఈనేపథ్యంలో క్షేత్రస్థాయిలో వ్యవసాయ సాగు, ఆచరణలో ఇబ్బందులు, తెగుళ్లు, రైతులకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, అందులో భాగంగా నమోదు చేయాల్సిన ఇ-క్రాప్, ఇన్సూరెన్స్ వంటి నమోదు కార్యక్రమాలను ఎప్పటికప్పుడు సమీక్షచేసి రైతులకు చేదోడు వాదోడుగా ఉండేందుకు వ్యవసాయ సలహా మండళ్లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కానీ, ఇవి కొన్నాళ్లగా మొక్కుబడిగా సాగుతున్నాయి. ముఖ్యంగా మండలి సభ్యులు, చైర్మన్ మాట్లేందుకు అవకాశం ఇవ్వడం లేదు. ఇంకా చెప్పాలంటే వారు కూడా మాట్లాడేందుకు చొరవ చూపడం లేదు. జెడ్‌పి చైర్మన్ అన్నీ తానై వ్యవహరించడం కూడా ఇందుకు ఒక కారణమని పలువురి వాదన. ఈ సంగతి కాస్త పక్కనబెడితే సమావేశంలో క్షేత్ర స్థాయి పరిస్థితులపై చర్చ సాగడం లేదు. శుక్రవారం నాటి సమావేశంలోనూ ఇదే రకమైన పరిస్థితి కనిపించింది. జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని, జలాశయాల్లో ఉన్న నీటిని సక్రమంగా వినియోగించుకునేలా రైతులకు అవగాహన కలిగించాలని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాస రావు అధికారులకు సూచించారు. వాస్తవానికి నీరు లేక పొలాలు, ముఖ్యంగా వరి పంట ఎండిపోతోంది. కొన్ని చోట్ల బీటలు వారుతున్నాయి. తోటపల్లి నుండి ఈ ఏడాది 55 వేల ఎకరాలకు నీరందించాలని లక్ష్యం కాగా ఇప్పటికే 45 ఎకరాల వరకు అందించామని అధికారులు సెలవిచ్చారు. వాస్తవానికి అంత నీరు అందడం లేదు. గుర్ల, చీపురుపల్లి, పూసపాటిరేగ మండలాలకు ఈ ఏడాది అసలు నీరే అందలేదు. వర్షపునీటితో ఉబాలు పట్టుకున్నారు. తాజాగా ఆ పంటలన్నీ ఎండిపోతున్నాయి. గత నాలుగేళ్లలో గడిగెడ్డకు నీరు రాకపోవడం ఇదే మొదటిసారి అంటూ గుర్ల రైతాంగం ఆవేదన వ్యక్తం చేస్తోంది. పిల్లకాలువలు పూర్తి కాకపోవడం, కాలువల నిర్వహణ గాలికి వదిలేయడమే ఇందుకు కారణం. దీన్ని కప్పిపుచ్చుకునే విధంగా సమావేశంలో చర్చసాగినట్టుగా పలువురు విమర్శిస్తున్నారు. ఆంధ్ర, తాటిపూడి, మడ్డువలస, పెద్దగెడ్డ, వెంగళరాయ సాగర్ తదితర జలాశయాల్లో నీరు పుష్కలంగానే ఉందంటూ జలవనరుల శాఖ అధికారులు సెలవిచ్చారు. అందుకు జెడ్‌పి చైర్మన్, కలెక్టర్ సహా ఓహో అటూ తలూపేశారు. కానీ, జలాశయాల్లో నీరు ఉంటే పొలాలు ఎందుకు ఎండిపోతున్నాయని మాట వరుసకు కూడా అడగకపోవడం గమనార్హం. ఉన్ననీరు కూడా పొలాల్లోకి వెళ్లే విధంగా కాలువల నిర్వహణ లేదు. వర్షపాతం నమోదు కూడా రైతాంగాన్ని ఆందోళన కలిగిస్తోంది. ఖరీఫ్ సీజన్‌లో అన్ని పంటలూ కలిపి 2,83,912 ఎకరాల్లో సాగవ్వగా, వరి అత్యధికంగా 2,34,437 ఎకరాల్లో సాగైంది. సీజన్ ముగిసేనాటికి (జూన్ నుంచి సెప్టెంబర్ వరకు) సాధారణ వర్షపాతం నమోదైనప్పటికీ జూన్‌లో 52 మిల్లీ మీటర్లు, ఆగస్టులో 24 మి.మీ వర్షపులోటు ఏర్పడడంతో ఉబాలు పట్టుకునేందుకు రైతులు అష్టకష్టాలు పడాల్సివచ్చింది. అక్టోబర్ 1 నుంచి ఇప్పటి వరకు చినుకు రాలలేదు. 87మి.మీ లోటు వర్షపాతం నమోదైంది. దీనికితోడు ఎండ తీవ్రత కూడా ఎక్కువగా ఉండడంతో వరి, మొక్కజొన్న, పత్తి తదితర పంటలన్నీ ఎండిపోతున్నాయి. పంటపొలాలు బీటలు వారుతున్నాయి. ఈనేపథ్యంలో జలాశయాల్లో ఉన్న కొద్దిపాటి నీటిని అందించేందుకు కాలువలు ఉన్నంతలో బాగుచేయించడం లేదా కరువు పరిస్థితులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు కనీసం చర్చించడం వంటి చర్యలకు సమావేశంలో కనీసం ప్రయత్నించకపోవడం గమనార్హం. ఇక ఇకెవైసి, ఇన్సూరెన్స్, ఇ-క్రాప్ నమోదు వంటివి శతశాతానికి చేరుకోలేకపోవడానికి గల కారణాలు కూడా చర్చించలేదు. ఈనేపథ్యంలో ఇలాంటి సమావేశాలు ఎందుకని, 80శాతం ప్రజానీకం సమస్యలు ముప్పావుగంటలో ముగించారంటే వ్యవసాయ రంగంపై పాలకులకు ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమౌతోందని జనం చర్చించు కుంటున్నారు.

వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

వరి పంటను పరిశీలించిన శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి - కురుపాం

వరిలో గల 1224 రకమైన ఎంటియు ధాన్యం అన్ని రకాల జబ్బులకు తట్టుకొని దోమపోటు నుండి రక్షణ కలుగుతుందని కెవికె వరి శాస్త్రవేత్త జి. శ్రీనివాస్ అన్నారు. శనివారం జియ్యమ్మవలస మండలంలో గల గిజబ, చింతలబెలగాం, పెదమేరంగి గ్రామాల్లో రైతులకు కెవికె ద్వారా అందించిన కొత్త వంగడాల వరి క్షేత్రాలను సిరి సంచుల అమలు చేస్తున్న నేపథ్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పంటలపై తీసుకోవలసిన జాగ్రత్తలు గూర్చి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలు తేజేశ్వరరావు, ప్రవంతి, అమృతవేణి, అనంత విహార రైతులు పాల్గొన్నారు.

30శాతం కుటుంబాలకు తాగునీరు కరువు

ప్రజాశక్తి - వీరఘట్టం

వీరఘట్టం మేజర్ పంచాయతీ పరిధిలో 30శాతం కుటుంబాలకు పూర్తిస్థాయిలో తాగునీరు అందటం లేదని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం తిరుపతిరావు శనివారం ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం వెంటనే అదనపు ట్యాంక్ నిర్మించాలని డిమాండ్ చేశారు. పట్టణంలో జనాభా పెరుగుతున్న దానికి తగ్గట్టు సదుపాయాలు పెరగడం లేదన్నారు. గడపగడపకు కార్యక్రమంలో ప్రజల సమస్యలు చెప్పినా నాయకులు స్పందించడం లేదని విమర్శించారు. 21 నెలలు గడుస్తున్నప్పటికీ ప్రధాన రహదారి విస్తీర్ణ పనులు అభివృద్ధి జరగలేదని రైతు బజార్ సౌకర్యాలు లేకపోవడంతో కూరగాయల రైతులు రోడ్లపైన కూరగాయల అమ్మకాలు జరుపుకునే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. 16 సామాజిక వర్గాలకు చెందిన వారు ఉన్నప్పటికీ వారి వారి సమస్యల పైన సమావేశం పెట్టి మాట్లాడుకునేందుకు సామాజిక భవన సదుపాయాలు కూడా లేవన్నారు. తక్షణమే స్థానిక ఎమ్మెల్యే కళావతి సమస్యల పైన దృష్టి పెట్టి పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

కదలని పనులు

- మందకొడిగా సాగుతున్న భవన నిర్మాణాలు
- అందుబాటులోకి రాని ఆర్‌బికె, సచివాలయాలు
- వైఎస్‌ఆర్ హెల్త్ క్లినిక్‌లదీ అదే పరిస్థితి
- నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - వీరఘట్టం

ప్రజలకు మరింత చేరువలో సేవలు అందించాలనే ఉద్దేశ్యంతో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామస్థాయిలో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ నిర్మాణ పనులు చేపట్టేందుకు శ్రీకారం చుట్టారు. అయితే ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన భవన నిర్మాణ పనులు ముందుకు సాగలేదు. దీంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా

దశమంతపురంలో అర్ధాంతరంగా నిలిచిపోయిన రైతు భరోసా కేంద్రం

భవన నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. ఫలితంగా ప్రభుత్వ లక్ష్యం నీరుగారినట్లైందని పలువురు చర్చించుకుంటున్నారు.

మండలంలో సచివాలయ, ఆర్‌బికె, హెల్త్‌క్లినిక్ భవన నిర్మాణాలు మందకొడిగా సాగుతున్నాయి. దశమంతపురం, చిన్న గోరకాలని, నర్సిపురం, వీరఘట్టం, బిటివాడ, రేగులపాడు, నడిమికెళ్ల, నడుకూరు, చలివేంద్రి తదితర గ్రామ సచివాలయాల్లో రైతు భరోసా కేంద్రాల నిర్మాణ పనులు పునాదులకే పరిమితమయ్యాయి. వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌లు వీరఘట్టం మినహా అన్ని గ్రామ సచివాలయాల్లో బోర్డులకే పరిమితమయ్యాయి.

ఇరుకైన గదుల్లో నిర్వహణ

మండలంలోని కిమ్మీ, నడిమికెళ్ల, చిటిపూడి వలస, తూడి, వండువ, కత్తుల కవిటి, తలవరం, చిదిమి, హుస్సేనపురం తదితర గ్రామాల్లో సచివాలయ నిర్మాణ పనులు పూర్తి అయినప్పటికీ వాటిని ప్రారంభించకపోవడంతో ఉన్న ఇరుకైన భవనాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మండల కేంద్రంతో పాటు రేగులపాడు, చిన్న గోరకాలని, తూడి తదితర గ్రామాల్లో భవన సదుపాయాలు లేకపోవడంతో సచివాలయాలు అద్దె కొంపలో నిర్వహిస్తున్నారు. అద్దె భవనాలకు అద్దెలు చెల్లించలేకపోతున్నామని ఇటువలె మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో పాలకులు ధ్వజమెత్తారు. వైయస్సార్ హెల్త్ క్లీనిక్‌లకు భవనాలు

చలివేంద్రిలో పునాదులకే పరిమితమైన సచివాలయ నిర్మాణం

లేకపోవడంతో అద్దె భవనాలతో పాటు చెట్ల నీడలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాలు చేపడుతున్నారు. భవన నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ప్రభుత్వ అధికార యంత్రాంగం పదేపదే ఆదేశాలు జారీ చేసినప్పటికీ గుత్తేదారులు నిర్మాణ పనులు చేపట్టేందుకు విముక్త చూపటం లేదు. చేసిన పనులకు బిల్లులు వస్తాయా రావా అన్ని సంసిద్ధతలో గుత్తేదారులు ఉన్నారు. ప్రస్తుతం మండలంలో జరుగుతున్న భవన నిర్మాణ పనులు ఏ స్థితికి వస్తాయో వేచి చూడాల్సి ఉంది.

శిక్షణా తరగతులనుద్దేశించి మాట్లాడుతున్న డిప్యూటీ డిఇఒ లిల్లీరాణి

విద్యార్థులకు కొత్త విషయాలు చెప్పాలి

ప్రజాశక్తి- సీతంపేట

సవర భాష విద్య వాలంటీర్లు శిక్షణలో నేర్చుకున్న పదాలు కొత్త విషయాలను విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో చెప్పాలని ఐటిడిఎ ఉప విద్యాశాఖ అధికారిని ఎ.లిల్లీరాణి అన్నారు. స్థానిక గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో సవర బాషా విద్య వాలంటీర్లు ముగింపు శిక్షణ కార్యక్రమంలో శనివారం మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంఒ కోటిబాబు, భాష వాలంటీర్ల రాష్ట్ర కార్యదర్శి డోంబు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు విజ్ఞానం పెంపొందించే కార్యక్రమాలు

ప్రజాశక్తి - సీతానగరం

దసరా సెలవుల్లో పాఠశాల విద్యార్థులకు విజ్ఞానం పెంపొందించేందుకు గ్రంథాలయాల ద్వారా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి టి వెంకటరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన శనివారం మాట్లాడుతూ గ్రంథాలయాలలో దసరా సెలవులు పురస్కరించుకొని ఈనెల 15 నుంచి 21 వరకు విద్యార్థులకు పుస్తకాలు చదివించడం పోటీలు, ఉపన్యాస పోటీలు నిర్వహించామన్నారు. వీటిల్లో గెలుపొందిన విద్యార్థులకు ఉపాధ్యాయులు చేతుల మీదుగా బహుమతులు అందజేశామన్నారు.

స్వీట్లు పంచుతున్న వెంకటరావు

సిబ్బందితో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ జగన్నాథరావు

అయోడైజ్డ్ ఉప్పునే వినియోగించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

ప్రతి ఒక్కరూ అయోడైజ్డ్ ఉప్పునే వినియోగించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. జగన్నాథ రావు అన్నారు. ప్రపంచ అయోడిన్ లోపం వల్ల కలిగే వ్యాధుల వారోత్సవాలను ఆయన శనివారం పార్వతీపురంలో ప్రారంభించారు. వారోత్స వాలు ఈ నెల 27వ తేదీ వరకు జరుగుతాయని చెప్పారు. అయోడిన్ లోపం వల్ల కలిగే ఆరోగ్య సమస్యలను గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. డివిజనల్, మండల, గ్రామ సచివాలయ స్థాయిలో సభలు, సమావేశాలు, ర్యాలీలు, వర్కు షాపులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అయోడిన్ లోపం వల్ల పిల్లల శారీరిక, మానసిక వృద్ధి, మనో వికాసం లోపిస్తుందన్నారు. గర్భస్థ శిశువుల పిండ అభివృద్ధి, నిర్మాణం మందగిస్తుందని, స్త్రీలలో గర్భ స్రావం, మృత శిశువు జననం, మరగుజ్జుతనం వంటి అవకాశాలు ఉంటాయని చెప్పారు. పిల్లల్లో బుద్ధి మాంద్యం, చెవుడు, మూగతనం రావచ్చున్నారు. గాయిటర్ వ్యాధి, హైపో థైరాయిడ్ వ్యాధులు సంభవించవచ్చని చెప్పారు. ఈ లోపాలను అధిగమించడానికి ప్రజలందరూ అయోడిన్ కలిగిన ఉప్పును మాత్రమే వాడాలని ఆయన పిలుపునిచ్చారు. అయోడిన్ ఉప్పు కలిగిన పేకెట్స్ పై నవ్వుతున్న సూర్యుడి బొమ్మ గుర్తు ఉంటుందని, గ్రామ స్థాయిలో ఆరోగ్య కేంద్రం ద్వారా ఉప్పులో అయోడిన్ ఉన్నదీ లేనిదీ తనిఖీ చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో యుపిహెచ్ సి వైద్యులు లావణ్య, ఎఎన్ఎంలు, ఆశాలుపాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రోడ్డు ప్రమాధంలో ద్విచక్ర వాహన చోదకుడుకు తీవ్ర గాయాలైన సంఘటన శనివారం సాయంత్రం బీజే పురం గ్రామం వద్ద చోటు చేసుకుంది. స్థానికులు అందించిన వివరాలు ప్రకారం.. కురుపాంకు చెందిన చిరుధాన్యాల వ్యాపారి కందుల వెంకన్న తన ఇద్దరు పిల్లలతో కలిసి ద్విచక్ర వాహనం పై జియ్యమ్మవలస మండలంలోని అంకవరం వెళుతుండగా అటు వైపుగా అతను ముందే వెళుతున్న ట్రాక్టర్‌ను డ్రైవర్ సడెన్‌గా నిలిపి వేయటంతో ద్విచక్ర వాహనం పై వెళుతున్న వ్యాపారి బలంగా ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీ కొట్టాడు. దీంతో అతనికి ఛాతీ, కడుపు, భుజం పై తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 కు సమాచారం అందించి చినమేరంగి ఆసుపత్రికి తరలించగా వైద్య తనిఖీలు నిర్వహించిన డాక్టర్ చంద్ర వర్మ మెరుగైనవైద్య సేవలు కోసం పార్వతీపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. జియమ్మవలస పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గజరాజుల రాకతో గజగజ

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని గొట్టివలస, సీమలవానివలస గజరాజులు సంచరిస్తున్నట్టు అటవీశాఖ అధికారులు తెలిపారు. సంబంధిత గ్రామాల అప్రమత్తతంగా ఉండాలని, ఎలాంటి దుశ్చర్యలకు పాల్పడ కూడదని అటవీశాఖ అధికారులు తెలిపారు. గతసారి ఈ మండలంలో గొట్టివలసలో బీభత్సాన్ని సృష్టించిన విషయం మర్చిపోకముందే, మళ్లీ ఈ మండలానికి ప్రవేశించడం వల్ల ఏక్షణాన ఏమవుతుందోనని స్థానికులు భయాందోళనతో గజ గజ వణుకుతున్నారు. ఇప్పటికే కొమరాడ, కురుపాం, జియ్యమ్మవలస మండలాల్లో ప్రాణ, పంట నష్టాన్ని చేకూర్చినప్పటికీ అటవీ శాఖ అధికారులు వీటిని తరలించకపోవడంపై ప్రజలు భయాందోళనతో ప్రయాణాలు కొనసాగించడం తప్పడం లేదు.

సీడిగూడ పరిసర ప్రాంతాల్లో ఏనుగులు

కురుపాం : మండలంలోని గిరిశిఖర గ్రామమైన తిత్తిరి పంచాయితీలో గల సీడీగూడ గ్రామ పరిసర ప్రాంతాల్లో శనివారం సాయంత్రం నాలుగు ఏనుగుల గుంపు కొండ ప్రాంతాల్లో సంచరిస్తూ అరటి, పసుపు, కొండచీపుర్లు తదితర అటవీ పంటలను నాశనం చేశాయి. ఈ సందర్భంగా ఆ గ్రామ గిరిజన ప్రజలు మాట్లాడుతూ ఇవి భామిని, సీతంపేట పరిసర ప్రాంతాల్లో తిరుగుతూ ఇటువైపు రావడంతో ఇంతవరకు ప్రశాంతంగా ఉంటూ పంటలను సాగు చేసుకుంటున్న తమకు భయాందోళన కలుగుతోందన్నారు. ఏనుగులు తమ గ్రామాల్లో కొండ ప్రాంతాల్లో

గరుగుబిల్లి : గొట్టివలస పాలాల్లో సంచరిస్తున్న ఏనుగులు

సంతరిస్తుండడం వల్ల ఏ క్షణాన ఏం జరుగుతుందోనని భయభ్రాంతులకు గురవుతున్నామని, ఎప్పుడు కొండలకు వెళ్తూ అటవీ ఫలసాయాలు ఏరుకుంటూ జీవనం సాగిస్తుంటామని సంబంధిత అటవీశాఖ అధికారులు స్పందించి తమ ప్రాంతం నుంచి ఏనుగుల గుంపును దూర ప్రాంతాలకు తరలించి తమ పంటలను, తమ ప్రాణాలను కాపాడాలని గిరిజనులు కోరుతున్నారు.

పెద్దూరును పంచాయతీగా ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి- వీరఘట్టం

మండలంలోని దశమంతపురం సచివాలయం పరిధిలోని పెద్దూరు గిరిజన గ్రామాన్ని పంచాయతీగా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు నిమ్మక నగేష్, బి రామారావు, మాసయ్య, ఉయ్యక రైకన్న, నాగేశ్వరరావు, కె.దుంబయ్య, నాగేశ్వరరావు, సింగయ్య, రామకృష్ణ, దుర్గారావు, బాబురావు, బి కృష్ణారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం విలేకరులతో మాట్లాడారు. పది కిలోమీటర్ల దూరంలో ఉన్న దశమంతపురం గ్రామానికి వచ్చి తమ సమస్యలను పరిష్కరిం చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. పెద్దూరు తోపాటు సింధూనగర్ గిరిజన గ్రామ గిరిజనులు కూడా అదే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. చలివేంద్రి సచివాలయ పరిధిలోనే ఎస్.గోపాలపురం కాలనీ, సవరగోపాలపురం, వీరఘట్టం సచివాలయ అచ్చపువలస గిరిజన గ్రామ గిరిజనులు వీరఘట్ట నికి గిరిపుత్రులు ఆయా ప్రాంతాలకు వచ్చి సమస్యలు పరిష్కరించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని గిరిపుత్రులు ఆరోపిస్తున్నారు. అచ్చెప్పువలస, సవరగోపాలపురం, సవర గోపా లపురం కాలనీ, సింధూనగర్ ఈ గ్రామాలన్ని ఒకే మార్గంలో ఉన్నందున వీటన్నింటినీ పెద్దూరులో కలిపి ఒక పంచాయతీగా ఏర్పాటు చేయాలని ఇది వరకే స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి, అప్పటి సీతంపేట ఐటిడిఎ పిఒ బి.నవ్యకు కూడా వినతిపత్రం అందజేసినట్లు గిరి పుత్రులు తెలిపారు. 2017 నుంచి పెద్దూరు గ్రామపంచాయతీని ఏర్పాటు చేయాలని వినతి పత్రాలు అందజేసినట్లు వారు తెలిపారు. ఇప్పటికైనా పాలకులు, అధికా రులు తాము పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని పెద్దూ రు గ్రామాన్ని పంచాయతీగా ఏర్పాటు చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని గిరి పుత్రులు ముక్తకంఠతో కోరుతున్నారు.

ఆరోగ్య సురక్షతో పేదలకు మేలు

ప్రజాశక్తి- సాలూరు

రాష్ట్రంలోని పేదల సంక్షేమమే పరమావధిగా సిఎం జగన్ మోహన్ రెడ్డి పని చేస్తున్నారని మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ చెప్పారు. శనివారం పట్టణంలోని 8వ సచివాలయం పరిధిలో ఉన్న బంగారమ్మ కాలనీలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ప్రయివేటు, కార్పొరేట్ వైద్యం పొందలేని పేదల కోసం ప్రభుత్వం నిపుణులైన వైద్యులతో వైద్య శిబిరాలు నిర్వహిస్తుందని వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్ర మంలో మున్సిపల్ కమిషనర్ టి.జయరాం, వార్డు కౌన్సిలర్ పి.మధుసూధన రావు, పట్టణ వైసిపి అధ్యక్షులు రాంబాయి పాల్గొన్నారు.

డిఐఒ ఆకస్మిక తనిఖీ

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా శనివారం బంగారమ్మ కాలనీలో నిర్వహించిన వైద్యశిబిరాన్ని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి టి.జగన్మోహనరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. శిబిరంలో ఎంతమంది రోగులకు టోకెన్లు జారీ చేశారు? ఏయే వైద్య సేవలు అందిస్తున్నారు. ఎలాంటి పరీక్షలు నిర్వహించారు. వంటి అంశాలపై ఆయన ఆరా తీశారు. ఆయన వెంట డాక్టర్ మహిపాల్, డాక్టర్ హర్షిత, సచివాలయం కార్యదర్శి మురళీకృష్ణ పాల్గొన్నారు.

సాలూరు రూరల్: జగనన్న సురక్ష పేద ప్రజల పాలిట శ్రీరామ రక్ష అని వైస్ ఎంపిపి రెడ్డి సురేష్ అన్నారు. ఆంధ్రా ఒడిస్సా వివాదాస్పద గ్రామమైన పట్టు చెన్నూరులో ఎంపిడిఒ గొల్లపల్లి పార్వతి ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా కార్యదర్శి

గుమ్మలక్ష్మీపురం : కుక్కిడిలో రోగులకు తనిఖీలు చేస్తున్న వైద్యాధికారి

దండి శ్రీనివాసరావు, మండల అధ్యక్షులు భరత శ్రీనివాసరావు, సర్పంచులు సుధా, ఆదయ్య, నూకయ్య, బేతురు, అనిల్, కొండపల్లి సింహాచలం పాల్గొన్నారు.

జగనన్న లేఅవుట్‌లో సదుపాయాలు కల్పించండి

మండలంలోని నెలిపర్తి జగనన్న లేఅవుట్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ సాలూరు మున్సిపల్ కమిషనర్‌నకు లబ్ధిదారులు శనివారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో కలిసి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహా కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు మాట్లాడుతూ జగనన్న గృహ సముదాయాలు నిర్మాణం వద్దకు అవసరమైన సిమెంట్, ఇటుక, ఇసుక, పిక్క తదితర వస్తువులు తీసుకువెళ్లడానికి సరైన రోడ్లు లేక పోవటంతో లబ్ధిదారుల చాలా ఇబ్బందులు పడుతున్నార న్నారు. ఈ కాలనీలోకి వెళ్లడానికి రోడ్లు, కాలువలు నిర్మించాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ టి జయరాంనకు వినతి పత్రం సమర్పించారు.

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని కుక్కిడి గ్రామంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పంచాయతీ పరిధిలోని వివిధ గ్రామాల నుంచి గిరిజనులు పెద్ద సంఖ్యలో వచ్చి సేవలను వినియోగించుకున్నారు. వైద్యులు డాక్టర్ బుద్దేశ్వర రావు, అభిలాష్ రోగులకు సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సాల్మన్ రాజు, డిప్యూటీ తహశీల్దార్ రాజేంద్ర, పంచాయతీ కార్యదర్శులు నాగరాజు, సచివాలయ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాలకొండ : ఇంటి ఇంటికీ వైద్యం అందించేందుకే జగనన్న ఆరోగ్య సురక్ష ముఖ్యోద్దేశమని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. శనివారం మండలంలో తంపటాపల్లిలో జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టారు. ప్రజలంతా వచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఆరోగ్యానికి ఈ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి బొమ్మాళి భాను, వైస్ ఎంపిపిలు కనపాక సూర్య ప్రకాష్, వాకుముడి అనిల్, ఎంపిడిఒ ఉమామహేశ్వరి, డిప్యూటీ తహశీల్దార్ బుచ్చయ్య, చందక జగదీష్ ఉన్నారు.

గిరిశిఖర గ్రామాల్లో 'బాబుతో నేను'

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో టిడిపి చేపడుతున్న కార్యక్రమాలకు గిరిజనుల నుంచి మంచి స్పందన వస్తోంది. ఇందులో భాగంగా మండలంలోని మారుమూల కొండమీద గ్రామమైన వనకాబడిలో బాబుతో నేను కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కురుపాం నియోజకవర్గం ఇంచార్జి తోయక జగదీశ్వరి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వనకాబడి గ్రామ గిరిజనులు ఆమెకు సాదర స్వాగతం పలికారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి చంద్రబాబు నాయుడు అరెస్టు గురించి వివరించారు. మన కష్టాలు పోవాలంటే, గిరిజనాభివృద్ధి జరగాలంటే టిడిపిని తప్పక గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ మహిళా ప్రధాన కార్యదర్శి వెంపటాపు భారతి, మండల కార్యదర్శి పోలూరు శ్రీనివాసరావు, క్లస్టర్ ఇంచార్జ్ కిల్లక దాసు, యూనిట్ ఇంచార్జీలు సోమరావు, అడ్డాకుల నరేష్, తాడంగి రామారావు,

జగదీశ్వరికి బొట్టుపెట్టి ఆహ్వానిస్తున్న గిరిజన మహిళ

ధర్మ, సీతారాం, సుందర్ రావు, అనంత్, త్రినాద్ దొర, చిట్టిబాబు, బాల పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ ఆశయ సాధనకు కృషి చేద్దాం

జియ్యమ్మవలస మండలం చినబుడ్డిడి గ్రామంలో ఎన్‌టిఆర్ విగ్రహావిష్కరణ మొదటి వార్షికోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎన్‌టిఆర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం గ్రామంలో బాబుతో నేను కార్యక్రమాన్ని నిర్వహించి చంద్రబాబు అరెస్టుపై ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పల్ల రాంబాబు, అరుకు పార్లమెంట్ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, ఎంపిపి బొంగు సురేష్, మూడడ్ల సత్యంనాయుడు, గురాన శ్రీరామ్మూర్తి నాయుడు, బుజింగ రావు, మాజీ సర్పంచ్ కరణం అప్పలనాయుడు, రాయిపిల్లి భారతి పాల్గొన్నారు.

విక్రయ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్

విడివికెల ఉత్పత్తులు ఖ్యాతి పొందాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

వన్ ధన్ వికాస్ కేంద్రాల (విడివికె) ఉత్పత్తులు ప్రపంచ కావాలని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి.విష్ణుచరణ్ అన్నారు. మండలంలోని అడారులో అగర్‌బత్తీ తయారు కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించారు. విడివికెలు ఉత్పత్తి చేస్తున్న అగర్‌బత్తులు నాణ్యత కలిగి ఉన్నాయని ఆయన ప్రశంసించారు. ఉత్పాదకాలు జిల్లా స్థాయి వరకు మాత్రమే కాకుండా రాష్ట్ర, జాతీయ స్థాయిలోకి వెళ్లాలని ఆయన చెప్పారు. ఇందుకు అవసరమగు సహాయ సహకారాలు ఐటిడిఎ అందిస్తుందని ఆయన అన్నారు. స్థానికంగా లభ్యమయ్యే ముడిసరుకులు వినియోగిం చుకోవాలని తద్వారా విలువ ఆధారిత ఉత్పాదకాలు రావాలని పిలుపునిచ్చారు. నాణ్యతలో రాజీ లేకుండా ఉత్పాదకాలను విశ్వ విఖ్యాతం చేయాలని సూచించారు. ఈ జిల్లా అగర్ బత్తులు ప్రఖ్యాతిగాంచిన బ్రాండ్ల సరసన చేరాలని ఆయన ఆకాంక్షించారు. తద్వారా భారీ స్థాయి పరిశ్రమగా మారుతుందని, మరింత ఎక్కువ మందికి జీవనోపాధులు లభిస్తుందని అన్నారు. గిరిజన కుటుంబాలు ఆర్థికంగా అభ్యున్నతి సాధించాలని, అందుకు అనుగుణంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో గిరి వెలుగు ఏపిడి వై. సత్యం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాల్సిందే..

ప్రజాశక్తి- బలిజిపేట

మధ్యాహ్న భోజన కార్మికుల, స్కూల్ స్వీపర్ల సమస్యలు పరిష్కరించాలని ష్కారం చేయాలని శ్రామిక మహిళ సంఘం నాయకులు వి.ఇందిర డిమాండ్ చేశారు. బలిజిపేట హైస్కూల్ ఆవరణంలో శనివారం మధ్యాహ్న భోజన కార్మికులు, స్కూలు స్వీపర్ల నాయకులు యు.లక్ష్మీ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భ ంగా వి.ఇందిర మాట్లాడుతూ రేషన్‌లై జేషన్ పేరుతో స్కూలు విలీనం చేయడం వల్ల ఉపాధి కోల్పోతున్న మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులకు ఉపాధి భద్రత కల్పించి కార్మికులుగా గుర్తించి కనీస వేతన ఇవ్వాలన్నారు. ప్రతినెలా 5వ తేదీ లోపు వేతనాలు, బిల్లులు ఇవ్వాల న్నారు. మెనూ ఛార్జీలు ప్రతి పిల్లోడికి 20 రూపాయలు ఇవ్వాలని, బీమా సౌకర్యం కల్పించి, ప్రమాదాల గురైన వారికి నష్టపరిహారం ఇవ్వాల న్నారు. వంటమ్మ లకు గుర్తింపు కార్డులు ఇచ్చి సామాగ్రి సరఫరా చేయాలని, వంట నిర్వహణ చోట మౌలిక సదుపాయాలు కల్పించా లని, రాగి జావా ఇతర వంట నిర్వహణకు వంట సామాగ్రి ప్రభుత్వం ఇవ్వాలని కోరారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ సౌకర్యం కల్పించి రాజకీయ వేధింపులు ఆపాలని, స్కూలు స్వీపర్లకు గుర్తింపు కార్డులు, పనిముట్లు, పని భద్రత, జీతాలు పెంచాల న్నారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు, స్వీపర్లు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఇందిర

సమన్వయంతో పనిచేయాలి

ప్రజాశక్తి- పాచిపెంట

చిన్నారులు, గర్భిణుల ఆరోగ్య శ్రేయస్సుకు సిబ్బంది సమన్వయంతో కృషి చేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి. జగన్మోహనరావు సూచించారు. ఈ మేరకు శనివారం ఆయన మంచాడవలస, గంగన్నదొరవలస, కర్రివలస గ్రామాలను సందర్శించి అక్కడ అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులకు నిర్వహించిన వ్యాధినిరోధక టీకా కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. టీకా కార్డులు, రికార్డులు తనిఖీ చేసి పిల్లలకు సకాలంలో టీకాలు వేస్తున్నారా లేదా అని పరిశీలించారు. టీకా గడువు తేదీలు పక్కగా నమోదు చేసి తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. టీకా ఆవశ్యకతను వారికి వివరించాలన్నారు. గర్భిణులకు టిడి వ్యాక్సిన్ రెండు డోసులు కాలవ్యవధి ప్రకారం వేయడం జరిగిందా లేదా అని ఎమ్‌సిహెచ్ కార్డులో పరిశీలించారు. పిల్లలు, గర్భిణుల ఆరోగ్య పరిశీలన చేసి బరువు తక్కువగా ఉన్న వారికి పౌష్టికాహారం సరిగా వినియోగించాలన్నారు. ఆయన స్వయంగా పిల్లల బరువును అక్కడ పరికరం ద్వారా సరిసూచి రికార్డులో నమోదును పరిశీలించారు. హైరిస్క్ గర్భిణుల ఆరోగ్యాన్ని తరచుగా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ప్రసవ సమయం దగ్గర పడుతున్న సమయంలో ఎటువంటి ఆరోగ్య సమస్యలు తలెత్తినా అప్రమత్తంగా ఉండాలన్నారు. రక్తహీనత నివారణ చర్యలు చేపట్టాలని గర్భిణులు ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు ప్రతి రోజూ వేయాలని, ఆరు నెలల నుండి ఐదేళ్ళ లోపు పిల్లలకు వారానికి రెండు సార్లు ఐరన్ సిరప్ వేయించాలని సూచించారు. వైద్య, అంగన్వాడి సిబ్బంది సమన్వయంతో పనిచేసి మాతా శిశు ఆరోగ్య శ్రేయస్సుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ శోభారాణి, సూపర్ వైజర్ జయ గౌడ్, వైద్య సిబ్బంది లీలావతి, శేషమ్మ, ఉషారాణి, గౌరీశ్వరమ్మ, అశోక్ కుమార్, వెంకటలక్ష్మీ, అంగన్వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.